క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన 'వక్కలగడ్డ'

ఖమ్మంవన్‌టౌన్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకుడు వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం జిల్లాలో ఉన్న రెండు ఎస్సీ నియోజకవర్గాల్లో 1978 తర్వాత ఇప్పటి వరకు మాదిగలకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించలేదని, మాదిగ సామాజికవర్గానికి జిల్లాలో ప్రాతినిధ్యం లేదన్నారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించినట్లు సోమచంద్రశేఖర్ తెలిపారు.

సీనియర్ మేట్లను ఎఫ్‌ఏలుగా నియమించాలి

కామేపల్లి: ఉపాధి హామీలో పని చేస్తున్న సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించి, గౌరవ వేతనం ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా కోశాధికారి ధరావత్ మాన్‌సింగ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పండితాపురం గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని పలు జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, ఎఫ్‌ఏలుఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియర్ మేట్లను తీసుకోవాలన్నారు. అదే విధంగా ఎఫ్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

నిరాధార ఆరోపణలు సహించం



స్థానికులతో మాట్లాడుతున్న ఎండీ ముస్తఫా

ఖమ్మంమయూరిసెంటర్: రమణగుట్టలో భూకబ్జా ఆరోపణలను కాంగ్రెస్ నాయకుడు ఎండీ.ముస్తఫా తీవ్రంగా ఖండించారు. ఆదివారం రమణగుట్ట ప్రాంతంలో పర్యటించి పలు పనులను పరిశీలించిన అనంతరం స్థానికులతో మాట్లాడారు. భూకబ్జా జరిగిందని కొంతమంది బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరాధార ఆరోపణలు చేస్తే సహించమని, ఇంచు భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధమన్నారు. జిల్లా మంత్రులను బదనాం చేసేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

రూ.5వేలు జరిమానా

ఖమ్మం అర్బన్: నగరంలోని 10వ డివిజన్‌లో చెట్టు నరికినందుకు గాను సదరు ఇంటి యజమానికి మున్సిపల్ అధికారులు రూ.5వేల జరిమానా విధించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను నరికితే జరిమానా విధించబడుతుందని అధికారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, డివిజన్ జవాన్‌లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ప్రొఫెసర్ జయశంకర్ పార్కు ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 29వ డివిజన్ కార్పొరేటర్ కొప్పెర ఉపేందర్ వైద్యుడు శీలం పాపారావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ సైదేశ్వర్‌రావు గుర్తుగా కుమారుడు చైతన్య సాయి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముమ్ముందు సేవా కార్యక్రమాలు విస్తృతపరచాలన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	మజాకా
ఆదిత్య	డ్రాగన్
శ్రీనివాస	శబ్దం

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	24		20
బెండకాయ	48	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	48	చుక్కకూర	3
బోడ కాకర	110		20
బీర	54	తోటకూర	3
దొండ	48		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	50		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		40
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	28		25
క్యాప్సికం	48	-ఖమ్మం వ్యవసాయం	

ఎల్ఆర్ఎస్‌పై ఫోకస్..



కేఎంసీలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్(ఫైల్)

కేఎంసీలో దరఖాస్తుల పరిశీలనకు బృందాలు

- టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందితో టీంల ఏర్పాటు
- ఎల్1 దశలో 27,987 దరఖాస్తులు
- ఫీజుల చెల్లింపులో కేఎంసీకి 2వ స్థానం
- ఈ నెలాఖరుతో ముగియనున్న గడువు

ఖమ్మంమయూరిసెంటర్: అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజుల చెల్లింపులో ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించడం, అమల్లోకి తెచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయడంతో దరఖాస్తుదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో జిల్లాలోనే అత్యధిక దరఖాస్తులు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుండే వచ్చాయి. వీటిని పరిశీలించి, ఫీజు కట్టించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుండగా.. తమ దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలని స్థల యజమానుల నుంచి ఒత్తిళ్లు రావడంతో ఖమ్మం నగరంలో ఎల్1 స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఒక్కో సిబ్బంది ఉండేలా మొత్తం 14 బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి స్థల పరిశీలన చేసేందుకు సూచనలు చేయనున్నారు.

దరఖాస్తుల తాకిడి..

ఎల్ఆర్ఎస్ ఫీజుల చెల్లింపులో ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు దరఖాస్తుదారుల తాకిడి పెరిగింది. తమ స్థలాలను పరిశీలన చేసి, ఫీజు చెల్లించేందుకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని కోరుతూ అధికారులను కలుస్తున్నారు. కేఎంసీ పరిధిలో మొత్తం 39,942 దరఖాస్తులు రాగా.. వీటిలో ఇప్పటి వరకు 3,983 దరఖాస్తులను పరిశీలించి, ఫీజు చెల్లించేందుకు అనుమతులు ఇచ్చారు. వీరిలో 954 మంది ఫీజు చెల్లించి లేఅవుట్ క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. ఇక 5,699 దరఖాస్తులకు సంబంధించిన స్థలం ప్రొహిబిటెడ్(నిషేధిత) ప్రాంతంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఎల్1 స్థాయిలో 27,897 దరఖాస్తులు ఉండగా, ఎల్2లో 711 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.5.86 కోట్ల ఆదాయం..

ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం రాయితీ ప్రకటించిన నాటి నుంచి జిల్లాలో ముఖ్యంగా కేఎంసీలో దరఖాస్తులు భారీగా వచ్చాయి. రాయితీని సద్వినియోగం చేసుకుని ఫీజు చెల్లించి స్థల క్రమబద్ధీకరణ చేయించుకునేందుకు యజమానులు ఆసక్తి చూపించారు. ఈనేపథ్యాన అధికారులు 3,983 దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించగా.. 954 మంది ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించడంతో కేఎంసీ నుంచి ప్రభుత్వానికి రూ.5.86 కోట్ల ఆదాయం సమకూరింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపుల్లో రాష్ట్రంలోనే కేఎంసీ రెండవ స్థానంలో ఉంది.

ఈనెలాఖరు వరకే గడువు..

రాష్ట్రంలో గత నెల 27న జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కోడ్ జిల్లాలో అమల్లో ఉండడంతో ప్రభుత్వం ప్రకటించిన రాయితీ ఇంకా అమల్లోకి రాలేదు. కాగా, ఎన్నికల కోడ్ ఈనెల 3న ముగుస్తుండడంతో అప్పటి నుంచి ఫీజుల చెల్లింపు ప్రక్రియ వేగవంతం కానుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెలాఖరు(మార్చి 31) వరకే ఫీజుల చెల్లింపునకు గడువు ఉండడంతో దరఖాస్తులను వేగవంతంగా పరిశీలన చేసి ఫీజు చెల్లింపులకు అనుమతులు ఇచ్చేలా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.

14 బృందాలు ఏర్పాటు..



ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు 14 బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఒక్కొక్కరు ఉండేలా చూస్తున్నాం. మార్చి 31వ తేదీలోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయడంతో పాటు ఫీజు చెల్లింపునకు అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు చేశాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

మున్సిపల్ కార్మికులకు సన్మానం

ఖమ్మం మామిళ్లగూడెం: సామాజిక సమరత వేదిక అహల్య భాయ్ హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల్లో భాగంగా సామాజిక సమరత వేదిక ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన 300 కుటుంబాలకు ఆదివారం ఖమ్మంలో సమ్మేళనం నిర్వహించి ఘనంగా సత్కరించారు. మండడపు ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ ఉప్పాల ప్రసాద్ హాజరై మాట్లాడారు. కుల, మత తారతమ్యాలు లేని సమాజస్థాపనకు ఎందరో సమరతా మూర్తులు త్యాగాలు చేశారన్నారు. అనంతరం గత మున్నేరు వరదల సమయాన సేవలందించిన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్మికులను సన్మానించారు.



కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



కూసుమంచి: మందులు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నేలకొండపల్లి/కూసుమంచి: నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి. నేలకొండపల్లి మండలం నాచేపల్లిలో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన స్థానిక పాఠశాలలో వైరా లయన్స్ కంటి ఆస్పత్రి సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే కూసుమంచి మండలం గట్టుసింగారంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యాన వైద్యులు పి.గోర్కి, పాటిబండ్ల సుదర్శన్‌రావుతో పాటు వైద్యులు పారుపల్లి నిశాంత్, కొల్లి అనుదీప్, అనుపమ పలు పరీక్షలతో పాటు ఎముకల దృఢత్వ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ బాధ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, ఇంటూరి హరగోపాల్, బొమ్మిడి నాగభూషణం, రమేష్, సురేష్, మౌలాలి, కళ్యాణ్ సాహూ, వైద్యులు వి.రామ్మోహన్‌రావు, సిరాజుద్దీన్, బాబురావు, యాఖుబ్, సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

మిర్చికి మద్దతు ధర ప్రకటించాలి

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి/రఘునాథపాలెం: రైతులు పండించిన మిర్చి పంటకు క్వింటాకు రూ.25వేల మద్దతు ధర ప్రకటించాలని ఆదివారం సీపీఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈనేపథ్యాన తిరుమలాయపాలెంలో ఈ నెల 3న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మండల కార్యదర్శి శ్రీను ఆధ్వర్యాన పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అలాగే నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలో రైతు సంఘం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యాన మిర్చి రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి గ్రామంలోని మిర్చి పంట కల్లాలను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్‌లు సందర్శించి రైతులతో మాట్లాడారు. లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న మిర్చి రైతులను ఆదుకునేందుకు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు రూ.25 వేలకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ , రైతు సంఘం బాధ్యులు మారుతి కొండలరావు, యర్ల తిరుపతిరావు, దండా సూర్యానారాయణ, సైదారావు, సత్యం, కృష్ణయ్య, తుల్లూరి నాగేశ్వరావు బింగి రమేష్, కొత్త వెంకన్న, కోడి లింగయ్య, మంగపతి, రమేష్, ఎస్.నవీన్‌రెడ్డి, ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, షేక్ మీరా సాహెబ్, రైతులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం: కల్లంలోని మిర్చిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రైతులు ఆత్మహత్య చేసుకోవద్దు..

కూసుమంచి: దేశానికి అన్నంపెట్టే రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడడం విచారకరమని, వారు ధైర్యంగా ముందుకు సాగాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దని మాజీ హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన బుర్ర దుర్గయ్య ఇటీవల ఆత్మహత్యకు పాల్పడగా అతని కుటుంబాన్ని ఆదివారం ఆయనతో పాటు తెలంగాణ రైతు సంక్షేమ సంఘం సభ్యులు పరామర్శించారు. దుర్గయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి పిల్లల చదువులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తాము రైతు ఆత్మహత్యల నివారణకు, వారికి అండగా ఉండేందుకు 2016లో తెలంగాణ రైతు సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశామని, రైతుల కష్టాల్లో పాలుపంచుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విజన్ పాఠశాల చైర్మన్ కొత్త శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ నరసింహ, అడిషనల్ సెక్రటరీ అనంతరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ న్యాయమూర్తి, తదితరులు


అక్రమంగా మట్టి తోలకాలు..

నేలకొండపల్లి: మండలంలోని కట్టుకాచారం రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వానికి చెందిన గుట్ట కొల్లగొడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కట్టుకాచారం, అప్పలనరసింహాపురం గ్రామాలకు చెందిన కొంతమంది ఆదివారం అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇట్టి విషయాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: విప్లవ వీరుడు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అమరుడు రాయల సుభాష్‌చంద్రబోస్ 7వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బచ్చోడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఈనెల 11న ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో వర్ధంతి సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, జిల్లా నాయకులు సుబహాన్, గొర్రెపాటి వీరస్వామి, పోలేపొంగు నాగయ్య, వెంకటేశ్వర్లు, బ్రహ్మాచారి, శ్రీకాంత్, మల్సూర్, షబ్బీర్, నగేష్, విజయ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతోనే విజయం సాధ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ ప్రదీప్, పక్కన డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ, శ్రీధర్‌రావు

ఖమ్మం సహకారనగర్: ప్రతీ విద్యార్థి పట్టుదలతో చదువుకుంటే విజయం సొంతమవుతుందని డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఫేర్ వెల్ డే ఆదివారం నిర్వహించగా డైరెక్టర్లు ఆర్‌వీ.నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు, నీలిమతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో సైతం ప్రోత్సహిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం డైరెక్టర్లు మాట్లాడుతూ విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు మరింత శ్రద్ధగా చదవాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రగతి'లో ఫేర్‌వెల్ డే..

ఖమ్మం అర్బన్: నగరంలోని ప్రగతి మోడల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ స్వర్ణలత తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీఎస్ఎస్ పుల్లూరు పీసీ హెచ్ సురేష్‌బాబు హాజరై మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఏ బేగ్, హెచ్ఎం హన్మంతరావు, ఇన్‌చార్జ్ దుర్వాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగరిక వికాస్ కేంద్రం ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యాన హ్యూమన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్మించిన నాగరిక వికాస్ కేంద్రాన్ని ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జమాతె ఇస్లామీ హింద్ చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు తమ ప్రభుత్వ సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు సాధిక్ అహ్మద్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ముహమ్మద్ ఇల్యాస్, జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా, జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ సమి, ఖిల్లా, ఇంద్రనగర్, ఇస్లాంపేట అధ్యక్షులు అబ్దుల్ మలిక్, నిజాముద్దీన్, అబ్దుస్ సుబూర్, సభ్యులు ఖలీల్ అహ్మద్‌ఖాన్, అబ్దుల్ ముజీబ్, అబ్దుల్ రాఫె, షేక్ ఇలియాస్, అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

కళాశాలల దోపిడీపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: ఫీజుల పేరుతో హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టే కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని, విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులను వేధించే కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్‌ఓల మాయమాటలను నమ్మి అడ్మిషన్ తీసుకున్నాక యాజమాన్యాలు ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడడం ఎంతవరకు సమంజసమన్నారు. పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాలకు వెళ్లేలా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, ప్రతాప్, రాజు, రాకేష్, గోపి, హరికృష్ణ, సాయి, నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో లక్ష్యసాధన

- 'రెజొనెన్స్ శ్రీనగర్' ఫేర్‌వెల్‌లో ఏసీపీ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులను లక్ష్యాలను ఎంచుకోవడంతో పాటు కృషి, పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధించొచ్చని ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థుల ఫేర్ వేల్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణితో కలిసి ప్రారంభించిన ఏసీపీ మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపించిన నేపథ్యాన పూర్తిగా చదువుపైనే దృష్టి పెట్టాలని తెలిపారు. అనంతరం డైరెక్టర్లు మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యార్థులు మరింత ప్రణాళికతో చదువుకుంటే మెరుగైన మార్కులు వస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించగా.. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏసీపీ శ్రీనివాసులు, పక్కన డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి

గురుదక్షిణలో ముగిసిన కుట్టు మిషన్ శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న రవి మారుత్

ఖమ్మం రూరల్: ఖమ్మం పట్టణంలోని గురుదక్షిణ ప్రాంగణంలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రవి మారుత్ హాజరై మాట్లాడుతూ.. కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుదక్షణ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, చావా సత్యనారాయణ, సభ్యులు ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తరామదాసు మందిరం అభివృద్ధికి వినతులు

నేలకొండపల్లి: హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన శ్రీ భక్తరామదాసు జయంతి ఉత్సవాల్లో నేలకొండపల్లికి చెందిన భక్తరామదాసు విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు సాధు రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక భక్త రామదాసు ధ్యాన మందిరం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లతో పాటు తెలంగాణ సంగీత అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాలను కలిసి వినతిపత్రాలు అందించి రామదాసు ధ్యాన మందిరం గురించి వివరించారు.



మంత్రి ప్రభాకర్‌తో సాధు రాధాకృష్ణమూర్తి

5న మాదిగల మహాడప్పు ప్రదర్శన

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ విషయంలో, జస్టిస్ షమీం అక్తర్ నివేదికలో ఉన్న లోపాలను సరిచేసి ఎస్సీలోని అన్ని కులాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందేలా చూడాలనే డిమాండ్‌తో ఈనెల 5న ఖమ్మంలో మాదిగల మహాడప్పు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఆదివారం ఖమ్మం అంబేద్కర్ భవనంలో కూరపాటి సునీల్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 6న అన్ని మండల కేంద్రాల్లో ఈ ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపూరి వెంకటేశ్వరరావు, అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వర్లు, వంగూరి ఆనందరావు, నరసింహారావు, రాము, శ్రీను, నాగభూషణం, వెంకన్న, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రామా.. ఏమీ దుస్థితి!



నగరంలోని 57వ డివిజన్ దివ్యాంగుల కాలనీలోని రామాలయానికి ఆలనా పాలన కరువైంది. గతంలో డివిజన్ వాసులు ఈ దేవాలయాన్ని నిర్మించి నిత్య పూజలు చేశారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనబడడం లేదు. నిత్యం దూప దీప నైవేద్యాలు, పూజలు చేసేందుకు పూజారి లేకపోవడంతో దేవాలయానికి భక్తులు రాక ప్రాంగణమంతా బురద పేరుకుపోయి పిచ్చి చెట్లు మొలిచాయి. ఆలయానికి ప్రహరీ కూడా లేదు. ఒకప్పుడు భక్తులచే పూజలందుకున్న రామాలయం ఇప్పుడు ఇదిగో ఇలా దీనస్థితిలో దర్శనమిస్తోంది. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్